# అల్పాహారం.. పిల్లలకు ఆరోగ్యం

- పౌష్టిక విలువలతో టిఫిన్ పెడుతుండడంపై విద్యార్థుల సంతోషం
- సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామంటున్న తల్లిదండ్రులు





బెస్ట్ బెస్ట్.. బ్రేక్ ఫాస్ట్

పస్తులుంటూ పాఠాలు వింటున్న నిరుపేద విద్యార్థుల కడుపునింపేందుకు సర్కారు తెచ్చిన 'సీఎం బ్రేక్‌ఫాస్ట్' స్కీం సత్ఫలితాలనిస్తున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో రోజుకో రుచికరమైన టిఫిన్ పెడుతుండడంతో ఏకాగ్రతతో చదువుకొనే అవకాశం కలుగుతున్నది. కూలీనాలీ చేసుకొని బతుకుతున్న తమ పిల్లలకు ప్రభుత్వం అల్పాహారం అందించడం గొప్పవిషయమని తల్లిదండ్రుల్లో హర్షం వ్యక్తమవుతున్నది. పొద్దటి పూటనే తండ్రిలాగా తమ బిడ్డల ఆకలితీరుస్తున్న సీఎం కేసీఆర్ సారుకు రుణపడి ఉంటామని చెబుతున్నది.

**- జగిత్యాలటౌన్/ కొడిమ్యాల/ ధర్మపురి, అక్టోబర్ 8**

## ఒక్కో రోజు ఖాళీ కడుపుతో వెళ్లేవాడు



కొడుకు చదువు కోసం జగిత్యాల పట్టణానికి వచ్చి జీవనం గడుపుతున్నాం. నా భర్త అనారోగ్యంతో ఇంట్లోనే ఉంటుండు. నేను హోటల్‌లో పని చేసి ఇల్లు ఎళ్లదీస్తున్న. నా కొడుకు చదువుకొని గొప్పవాడు కావాలని ఈ కష్టం చేస్తున్నా. ఉదయం పూట కొడుకుకు టిఫిన్ పెట్టే భాగ్యం మాకు లేదు. రాత్రి అన్నం మిగిలితేనే మర్లేసి పెట్టే దాన్ని. ఒక్కో రోజు ఖాళీ కడుపుతో స్కూల్‌కు వెళ్లేవాడు. ఇప్పుడు ముఖ్యమంత్రి అల్పాహార పథకంలో మా కొడుకు రోజు టిఫిన్ తినే భాగ్యం కలిగింది. మధ్యాహ్నం స్కూల్లోనే అన్నం పెడుతున్నరు. నాకు ఎంతో సంతోషంగా ఉంది. ఇట్లాంటి ముఖ్యమంత్రులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నా.

**- చెవులమద్ది శ్యామల, గొల్లపల్లి**

## తినక పోవడంతో చదువుపై శ్రద్ధ ఉండేది కాదు



ఉదయం స్కూల్ వెళ్లే సమయానికి ఇంట్లో టిఫిన్ అయ్యేది కాదు. ప్రతి రోజు అమ్మ ఇంటి పనులు పూర్తి చేసుకొని వంట పనులు ప్రారంభించడానికి తొమ్మిది అవుతుంది. మా స్కూల్ టైం 9.30. నేను 9 గంటలకు ఇంట్లో నుంచి వెళ్లాలి. దీంతో ఉదయం ఏమీ తినకుండా స్కూల్‌కు వెళ్లేవాడిని. 10 గంటల వరకు ఏమైనా తింటే బాగుండు అనిపిస్తుంది. కాని మధ్యాహ్న ఒంటి గంట వరకు ఏం తినరాదు. దీంతో చదువుపై శ్రద్ధ ఉండేది కాదు. కానీ ఇప్పుడు సీఎం బ్రేక్‌ఫాస్ట్‌తో కడుపునిండా తింటున్న. ఇక మంచిగా చదువుకుంట.

**- భూక్యా అరవింద్, 7వ తరగతి (ప్రభుత్వ పాఠశాల, సూరంపేట కొడిమ్యాల)**

## మా పిల్లలకు ఎంతో మేలు



మాలాంటి పేద కుటుంబాల నుంచి స్కూళ్లకు వెళ్లే చిన్నారులకు ఉదయం పూట టైంకు టిఫిన్ ఇవ్వడం చాలా కష్టం అవుతుండె. నేను టైలరింగ్ పని చేస్తుంట. నాకు పని ఒత్తిడి ఉంటుంది. ఇలాంటి టైంల మా పిల్లలకు అన్నం అందించడం లేటవుతుండె. అలాగే, రోజూ ఏదో ఒక వెరైటీ చేసి పెట్టే స్థోమత మాకు లేదు. సీఎం కేసీఆర్ సార్ చాలా గొప్ప నిర్ణయం తీసుకున్నరు. మాలాంటి పేదల ఇండ్లలో ఉడికిన అన్నం, రాత్రి మిగిలిన కూరలతో బడికి వచ్చే సమయానికి పిల్లలకి పెడుతుంటం. కానీ, కేసీఆర్ సార్ రోజుకో రకం అల్పాహారం మా పిల్లలకు ఇస్తున్నరు.

**- ఎక్కలదేవి కావ్య, విద్యార్థిని తల్లి, సిరిసిల్ల (తెలంగాణచౌక్)**

## బ్రేక్‌ఫాస్ట్ తిన్నా.. బాగుంది.



మా స్కూల్లో ఇడ్లీ సాంబార్ బ్రేక్‌ఫాస్ట్ పెట్టిన్రు. తిన్నా బాగుంది. స్కూల్ సెలవు రోజైన ఆదివారం మాత్రమే ఇంట్లో తింటాం. ఇప్పుడు రోజూ స్కూల్లో పెడుతరు. ఆరు రోజులు ఆరు రకాల బ్రేక్‌ఫాస్ట్ పెడుతారని మా హెచ్‌ఎం సార్ చెప్పిన్రు. మాకు ప్లేట్, గ్లాస్ కూడా ఇచ్చిన్రు. ఇక నుంచి నేను స్కూల్‌కు రెగ్యులర్‌గా వచ్చి బ్రేక్‌ఫాస్ట్ చేస్తూ మంచిగా చదువుకుంట.

**- ఎండీ హజ్రా, నాలుగో తరగతి, ఎంపీఎస్, రామగుండం(జ్యోతినగర్)**

## అల్పాహారం ప్రారంభించడం సంతోషంగా ఉంది.



మా లాంటి పేద విద్యార్థుల ఆకలి తీర్చడానికి ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉంది. ఉదయం ఆకలితో వచ్చి చదువుకోవాలంటే ఇబ్బందిగా ఉండేది. చదువు చెప్పినా ఆకలికి అర్థం అయ్యేది కాదు. అల్పాహారం చేసి చదువుకోవడం వల్ల చక్కగా అర్థం చేసుకోవచ్చు. వేరే ధ్యాస లేకుండా ఉంటుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ఎంతో మంది పేద విద్యార్థులకు మేలు చేకూరనున్నది. నేను ఇక చక్కగా చదువుకుని మంచి మార్కులు తెచ్చుకుంటా. ఆకలి తీర్చుతున్న సీఎం సారుకు కృతజ్ఞతలు.

**- దేవరకొండ ధనుశ్, ఏడో తరగతి, జడ్పీహెచ్‌ఎస్ (హుజూరాబాద్)**

## వంట చేసేసరికి ఆలస్యమయ్యేది..



నాకు ఇద్దరు పిల్లలు. పెద్దపల్లిలోని అమర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నరు. నేను షాపు నడుపుకుంటున్నా. రోజు పొద్దున లేచి పిల్లలను రెడీ చేసి, వంట చేసి వారిని స్కూల్‌కు పంపించేసరికి ఆలస్యమయ్యేది. అప్పుడప్పుడు పిల్లలు పస్తులతోటి బడికి వెళ్లేవాళ్లు. తెలంగాణ ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన అల్పాహారం పథకంతో మా పిల్లలకు ప్రతిరోజూ కడుపునిండుతది. ప్రతిరోజూ సమయానికి స్కూల్‌కు వెళ్లి, టిఫిన్ చేసి చక్కగా చదువుకుంటరు. ఇంత మంచి నిర్ణయం తీసుకుని, పిల్లల ఆకలి తీర్చుతున్న సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటం..

**- జవాజి పద్మ, విద్యార్థి తల్లి, రంగంపల్లి, (పెద్దపల్లి కమాన్)**

## విద్యార్థులపై కేసీఆర్‌కు ప్రేమ



విద్యార్థులు అంటే సీఎం కేసీఆర్‌కు ఎంతో ప్రేమ. గత పాలకులు ఏనాడూ కూడా విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలనే ధ్యాస లేకుండె. కానీ తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రభుత్వ పాఠశాలల్లో వసతి సౌకర్యాలు మెరుగుపడ్డాయి. విద్యార్థులకు కావల్సిన మౌళిక వసతులతో పాటు సన్న బియ్యం భోజనం, యూనిఫాం, నోట్ బుక్కులు, వర్క్ బుక్‌లతో పాటు కావల్సిన సామగ్రిని అందిస్తున్నారు. ఉదయం పూట ప్రత్యేక అల్పాహారం అందిస్తుండడం అభినందనీయం. విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

**- వేల్పుల మల్లేశ్వరి, విద్యార్థిని తల్లి (మానకొండూర్)**

## బలవర్ధకమైన అల్పాహారం అందించడం హర్షణీయం



విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు పోషకాహార లోపం ఏర్పడకుండా బలవర్ధకమైన అల్పాహారం అందించడం కేసీఆర్ సారు గొప్ప గుణానికి నిదర్శనం. బడి పిల్లల కోసం ఉదయం బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ అమలు చేయడం ఆనందదాయకం. బడి మానేసిన పిల్లలు కూడా స్కూల్‌కు వచ్చేలా పథకాలు ప్రవేశపెట్టడం సంతోషంగా ఉంది. సీఎం కేసీఆర్ సారుకు ధన్యవాదాలు. ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి దయవల్ల కేసీఆర్ సారు నిండు నూరేండ్లు ఆరోగ్యంగా ఉండాలి. మళ్లీ ఆయనే సీఎంగా రాష్ట్రాన్ని పాలించాలని స్వామివారిని కోరుకుంటున్న.

**- దీటి లక్ష్మణ్, కమలాపూర్, ధర్మపురి**

## మంచి పథకాలను తెచ్చుడు సారుకే సాధ్యం



ప్రజలకు ఉపయోగపడే విధంగా మంచి పథకాల ను తెచ్చుడు సీఎం కేసీఆర్ సారుకే సాధ్యమైతది. నా బిడ్డ గంగాధర మోడల్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతోంది. పాఠశాలలో మంచిగా చదువు చెపుతున్నారు. అంతే కాకుండా మధ్యాహ్నం భోజనం చక్కగా వడ్డిస్తున్నారు. ఇప్పుడు మళ్ల పొద్దునే టిఫిన్ పెడుతుండ్లు. పిల్లల గురించి ఇంత మంచిగ ఆలోచించేటోళ్లు ఇంకెవ్వరు ఉండరు. చిన్నప్పుడు మేము చదువుకునేటప్పుడు మా సర్కారు బడిల ఇసొంటివి ఏం లేకుండె. మా పిల్లల గురించి సక్కటి ఆలోచలు చేస్తున్న కేసీఆర్ సారుకు రుణపడి ఉంటాం.

**- పంది సంపత్, మధురానగర్(గంగాధర)**

## థాంక్యూ కేసీఆర్ తాత..



మా చదువుల కోసం గొప్పగా ఆలోచన చేసి బ్రేక్ ఫాస్ట్ ఏర్పాటు చేసిన సీఎం కేసీఆర్ తాతకు థాంక్యూ.. నేను కాకర్లపల్లి గవర్నమెంట్ స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్న. మాకు ఇంటి వద్ద పొద్దున టిఫిన్ ఉండదు. బాగా చదువుకోవాలంటే కడుపునిండా అన్నం తినాలి. అందుకోసం మాలాంటి వాళ్ల కోసం స్కూళ్లనే పొద్దున టిఫిన్, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేస్తున్నరు. ఇప్పుడు కండుపునిండా తిని చక్కగా చదువుకుంటం..

**- శివాని, విద్యార్థిని, కాకర్లపల్లి, (మంథనిరూరల్)**

## ఆకలి తీర్చిన కేసీఆర్ సార్‌కు థాంక్స్




రోజు ఉదయం ఆకలి కడుపుతో బడికి వచ్చి మధ్యాహ్న భోజనం వరకు ఉండాలంటే కడుపులో ఎలుకలు తిరిగేవి. ఆఖరికి చదువు కూడా మెదడుకు ఎక్కేది కాదు. అలాంటి సమయంలో సీఎం కేసీఆర్ సారు పిల్లల కష్టాలను గుర్తించి ఉదయం అల్పాహారం పెట్టి చదువుకోవాలని ప్రోత్సహించడం చాలా బాగుంది. అడగకుండానే మా ఇబ్బందులను గుర్తించి ఆకలి తీర్చుతున్న సీఎం కేసీఆర్ సార్‌కు చాలా థాంక్స్.

**- బొక్క ఇందుశ్రీ, పదో తరగతి, జడ్పీహెచ్‌ఎస్ (హుజూరాబాద్)**

# వీకెండ్ మస్తీ అదరహో..

- తీగల వంతెనపై ఆకట్టుకున్న ప్రదర్శనలు



డ్రోన్లతో మంత్రి గంగుల కమలాకర్ చిత్రం

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 8 : నగర శివారులోని తీగెల వంతెనపై ఆదివారం నిర్వహించిన వీకెండ్ మస్తీ అదరహో అనిపించేలా సాగింది. ఈ సందర్భంగా కళాకారుల ఆటపాటలు అలరించాయి. పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి వీక్షించారు. ఈ క్రమంలో తీగల వంతెన కిక్కిరిసిపోయింది. బుక్‌స్టాళ్లు, చిన్నారుల నృత్యాలు, కళాకారుల పాటలు నగరవాసులకు కనువిందు చేశాయి. ఈ కార్యక్రమంలో మంత్రి గంగుల కమలాకర్ కుటుంబసభ్యులు, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.








వీకెండ్ మస్తీలో పాటలు పాడుతున్న కళాకారులు, హాజరైన నగర ప్రజలు

## ఆరోగ్యాన్ని, ఆహ్లాదాన్ని అందించడమే ధ్యేయం



ప్రజలకు అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఆరోగ్యాన్ని, ఆహ్లాదాన్ని అందించడమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేస్తున్నది. హైదరాబాద్ నగర ప్రజలకు మాత్రమే అందుబాటులో ఉండే ట్యాంక్ బండ్ ప్రతీ నియోకవర్గ కేంద్రంలో ఉండాలని సీఎం కేసీఆర్ తలపించారు. అందులో భాగంగానే పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలకు ఎల్లమ్మ-గుండమ్మ చెరువు మినీ ట్యాంక్‌బండ్ అందుబాటులోకి వచ్చింది. ఇక్కడికి ఉదయం వస్తే సాయంత్రం వరకూ ఆహ్లాదాన్ని పొందేలా అన్ని ఏర్పాట్లు చేశాం. శనివారం బోటింగ్‌ను కూడా అందుబాటులోకి తెచ్చాం. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

**-దాసరి మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్యే, పెద్దపల్లి**




ప్యాసింజర్ స్పీడ్ బోట్‌లో ప్రయాణం చేస్తున్న పర్యాటకులు

# ఆహ్లాదంగా జలవిహారం

- ఎల్లమ్మ-గుండమ్మ చెరువులో అందుబాటులోకి బోటింగ్
- ఆసక్తి చూపుతున్న స్థానికులు
- ఆటవిడుపుగా పెద్దపల్లి మినీ ట్యాంక్‌బండ్
- పర్యాటక శోభను సంతరించుకున్న జిల్లా కేంద్రం

పెద్దపల్లి, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ): ఆటవిడుపు, ఆహ్లాదానికి కేరాఫ్‌గా మారిన మినీ ట్యాంక్‌బండ్ పర్యాటక శోభను సంతరించుకున్నది. జిల్లా కేంద్రం సాగర్‌రోడ్డులోని ఎల్లమ్మ-గుండమ్మ చెరువు మినీ ట్యాంక్‌బండ్‌పై జలవిహారం అందుబాటులోకి వచ్చింది. జిల్లా కేంద్రం, చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు, చిన్నారులకు ఆటవిడుపుగా మారింది. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్, మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి శనివారం రాత్రి మినీ ట్యాంక్‌బండ్‌ను ప్రారంభించడంతో బోటింగ్ అందుబాటులోకి వచ్చింది. దీనికి తోడు మినీ ట్యాంక్‌బండ్‌పై చిన్నారుల క్రీడా పరికరాలు, చిల్డ్రన్ గార్డెన్ ప్లేయింగ్ ఎక్విప్‌మెంట్, మల్టీ స్వింగ్ ఎక్విప్‌మెంట్, మైల్డ్ స్టీల్ క్లైంబింగ్ బార్, జంగిల్ క్లైంబింగ్ బార్, స్పైరో స్పిన్, స్ట్రైట్ నెట్ ప్లేగ్రౌండ్ క్లైంబర్, గ్రీన్ స్పైరల్ ప్లేగ్రౌండ్ స్లైడ్, జ్విమ్స్, స్వింగ్స్, క్రాస్ స్వింగ్స్, స్టేట్ స్వింగ్స్, పైప్ స్వింగ్స్, ఉయ్యాలలు, రాక్ క్లైంబింగ్, రౌండ్ బౌట్, రొటేటింగ్ క్లైంబర్స్, హోల్డ్ అండ్ స్పిన్నర్స్, ఎక్సర్‌సైజ్ నిచ్చెనలు, జాయింట్ స్లైడ్స్, బ్యాలెన్సింగ్ స్వింగ్స్‌తో పాటు అనేక రకాల స్పోర్ట్స్ మెటీరియల్‌ను బిగించి అందుబాటులోకి తెచ్చారు. రాక్ ఫిల్లింగ్, సైడ్ గ్రిల్స్, వాకింగ్ ట్రాక్‌తో పాటు నిండుకుండలా ఉన్న ఎల్లమ్మ గుండమ్మ చెరువు జలాలు, ఆకుపచ్చని అందాలతో మినీ ట్యాంక్‌బండ్ పర్యాటకులను పరవశింపజేస్తున్నది.

## ప్రారంభమైన జలవిహారం

పెద్దపల్లి జిల్లా కేంద్రం నడిబొడ్డున ఎల్లమ్మ-గుండమ్మ చెరువు 120 ఎకరాల 28 గుంటల్లో విస్తరించి ఉన్నది. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఆ చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దారు. పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి నిరంతర పర్యవేక్షణలో మినీ ట్యాంక్‌బండ్ ప్రజలను ఆకట్టుకునేలా సొబగులు అద్దుకుంటున్నది. మిషన్ కాకతీయ ఫేస్-2లో రూ.6 కోట్ల నిధులతో చెరువు పూడికతీతతో పాటు ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేశారు. చెరువు కట్టను విస్తరించి బయటి వైపు రిటైనింగ్ వాల్, లోపలి వైపు బండ్ రివిట్‌మెంట్ చేశారు. చూట్రెన్స్, డౌన్ స్ట్రీమ్, గ్రాస్, కట్టకు ఇరువైపులా రేయిలింగ్ పనులు కూడా చేశారు. దీంతో చెరువు విశాలంగా మారింది. చెరువులో బోటింగ్‌కు అనుకూలంగా మారింది. అంతేకాకుండా 120 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఎల్లమ్మ-గుండమ్మ చెరువును చుట్టి వచ్చేలా పెద్దపల్లి మున్సిపల్, రాష్ట్ర టూరిజం శాఖ సమన్వయంతో బోటింగ్‌ను ప్రారంభించారు. 20మంది పర్యాటకులు కూర్చొని ప్రయాణించే సామర్థ్యం ఉన్న ఒక ప్యాసింజర్ స్పీడ్ బోట్, నలుగురు కూర్చునే సామర్థ్యం ఉన్న ఒక స్పీడ్ బోట్, నలుగురు కలిసి బోటింగ్ చేసే సామర్థ్యం ఉన్న రెండు పెడల్ బోట్లను ప్రారంభించారు. జలవిహారం ప్రారంభం కావడంతో బోటింగ్ చేసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున ఆసక్తి చూపిస్తున్నారు.

## జలవిహారం ధరలు ఇలా ..

పెద్దపల్లి మినీ ట్యాంక్‌బండ్‌లో జలవిహారం చేసేందుకు టూరిజం శాఖ ధరలను నిర్ణయించింది. 20 మంది సామర్థ్యం కలిగిన ప్యాసింజర్ స్పీడ్ బోట్‌లో ప్రయాణం చేసే పెద్దలకు ఒక్కొక్కరికి రూ.50, పిల్లలకు రూ. 30, స్పీడ్‌బోట్‌లో ప్రయాణం చేసే నలుగురికి రూ. 350, పెడల్ బోట్‌లో ప్రయాణం చేసే నలుగురికి రూ.200గా నిర్ణయించారు.

## బోటింగ్ ఎంజాయ్ చేశాం

హైదరాబాద్ ఇతర నగరాలకే పరిమితమైన బోటింగ్ మా పెద్దపల్లికి వస్తుందని ఎన్నడూ అనుకోలేదు. శనివారం మినీ ట్యాంక్‌బండ్‌ను ప్రారంభించడం, బోట్లను ఏర్పాటు చేయడం గొప్ప విషయం. మా కుటుంబం అంతా చాలా ఎంజాయ్ చేసింది. చాలా ఆనందంగా ఉంది.

**-పసులోటి వాణి-రవికుమార్, పెద్దపల్లి**



## చాలా సంతోషంగా ఉంది



నేను పుట్టి పెరిగింది ఇక్కడే. వివాహానంతరం వరంగల్‌లో ఉంటున్న. భర్తతో కలిసి శనివారం ఇక్కడికి వచ్చాం. ఎల్లమ్మ-గుండమ్మ చెరువు మినీట్యాంక్‌బండ్ అయ్యిందంటే చూడడానికి వచ్చాం. చాలా అందంగా తీర్చిదిద్దారు. బోటింగ్ కూడా చేశాం. చాలా సంతోషంగా ఉంది.

**-కడప మేరీ, వరంగల్**

## బోటింగ్‌కు చాలా ఆసక్తి చూపుతున్నరు



శనివారం నుంచి బోటింగ్ ప్రారంభమైంది. బోట్లు వచ్చి పది రోజులైంది. రోజు చాలా మంది బోటింగ్ చేస్తామని అడిగేవాళ్లు. ఇంకా ప్రారంభం కాలేదని చెప్పే వాడిని. ఆదివారం ఉదయం నుంచి చాలా మంది వచ్చారు. బోటింగ్ చేస్తున్నారు. బోట్లల్లో తిరిగే సమయంలో వాళ్లు చాలా సంతోష పడుతున్నారు. అందరికీ లైఫ్ జాకెట్లు ఇచ్చి బోటింగ్ చేయిస్తున్నాం.

**-తాళ్లపల్లి తిరుమలేశ్, బోట్ డ్రైవర్(మినీ ట్యాంక్‌బండ్)**

## ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి, మున్సిపల్ పాలకవర్గం, పర్యాటక శాఖ సహకారంతో పెద్దపల్లి మినీ ట్యాంక్‌బండ్‌లో బోటింగ్ ఏర్పాటు చేశాం. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

**-వెంకటేశ్, మున్సిపల్ కమిషనర్ పెద్దపల్లి**

## మంచి అనుభూతి



మాది పెద్దపల్లి మండలం నిమ్మనపల్లి. ఇక్కడే పుట్టి పెరిగిన. ఇప్పుడు ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో ఉంటున్న. ఓ పని మీద కుటుంబంతో ఊరికి వచ్చిన. శనివారం బోటింగ్ స్టార్ట్ అయ్యిందని తెలిసి వచ్చినం. చాలా ఎంజాయ్ చేసినం. పెద్దపల్లిలో బోటింగ్ చేయడం మంచి అనుభూతిని ఇచ్చింది.

**-పొలిశెట్టి వెంకటేశ్, నిమ్మనపల్లి (పెద్దపల్లి మండలం)**